సాక్షి
సిద్దిపేట
గురువారం । 22 । ఫిబ్రవరి । 2024



నాచగిరి వద్ద నూతన చెక్‌డ్యాంలో ఉరకలేస్తున్న వరద నీరు

నాచగిరి చెక్‌డ్యాంకు జలకళ

నాచగిరి వద్ద హల్దీ ఎగువ చెక్‌డ్యాం నిన్నటి వరకు నీరులేక వెలవెలబోయింది. నాలుగు రోజుల క్రితం కొండ పోచమ్మ సాగర్ నుంచి గోదావరి జలాలు విడుదల చేయడంతో బుధవారం చెక్‌డ్యాం నిండా నీరు చేరి జలకళ సంతరించుకుంది. దీంతో రెండు చెక్‌డ్యాంలు నీళ్లతో పరవళ్లు తొక్కుతూ యాత్రీకులను ఆకట్టుకుంటున్నాయి. – వర్గల్(గజ్వేల్)

న్యూస్‌రీల్

నేడు మంత్రి పర్యటన



మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: నియోజకవర్గంలోని పలు మండలాల్లో గురువారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించనున్నారు. పలు మండలాల్లో జరుగుతున్న సమ్మక్క సారలమ్మ జాతరలను సందర్శించి అమ్మవార్లను దర్శించుకుంటారు. ఉదయం 11.30 గంటలకు సైదాపూర్ మండలం వెన్నంపల్లిలో సమ్మక్క సారలమ్మ గద్దెలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. అలాగే ఉదయం 11.55 గంటలకు సైదాపూర్ మండల కేంద్రం, మధ్యాహ్నం 12.25కు ఎల్కతుర్తి మండలం దామెర, 12.55 గంటలకు భీమదేవరపల్లి మండలం ముల్కనూర్, 1.25 గంటలకు భీమదేవరపల్లి మండలం ఎర్రబెల్లి, 1.55 గంటలకు భీమదేవరపల్లి మండలం కొత్తకొండ, 2.45 గంటలకు హుస్నాబాద్ టౌన్, 3.25 గంటలకు అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి, 3.55 గంటలకు హుస్నాబాద్ మండలంలోని పొట్లపల్లి, 4.25 గంటలకు కోహెడ మండల పరిధిలోని పరివేద, 4.55 గంటలకు కోహెడ మండలం వింజపల్లి, 5.25కు కోహెడ మండలంలోనే తంగళ్లపల్లిలో సమ్మక్క సారలమ్మ జాతరల్లో మంత్రి పాల్గొని మొక్కులు చెల్లించుకుంటారని మంత్రి కార్యాలయం నుంచి విడుదలైన ప్రకటనలో పేర్కొన్నారు.

హాఫ్ మారథాన్ పోస్టర్ ఆవిష్కరించిన సీపీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: రన్నింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మార్చి 10న నిర్వహించనున్న హాఫ్ మారథాన్ నాలుగో ఎడిషన్ రన్నింగ్ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం అసోసియేషన్ సభ్యులతో కలిసి పోలీసు కమిషనర్ అనురాధ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణకు రన్నింగ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ హాఫ్ మారథాన్ రన్‌లో పాల్గొనాలనుకునే వారు తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పరందాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

'మొగి' నివారణకు సస్యరక్షణ


జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్



వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

మర్కూక్(గజ్వేల్): వరి పంటలో మొగి పురుగు నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ పిలుపునిచ్చారు. మండలంలోని శివారువెంకటాపూర్, మర్కూక్ గ్రామాల్లో బుధవారం వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో గంధక దుష్ప్రభావం వల్ల రైతులు నష్టపోతున్నారని చెప్పారు. ఒకే పొలంలో ఏళ్ల నుంచి ఒకే పంటను సాగు చేయడం వల్ల సల్ఫైడ్ ప్రభావం కూడా గమనించామన్నారు. రైతులు పంట మార్పిడి చేయాలని సూచించారు. మొగి పురుగు నివారణకు అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. ఆయన వెంట ఏఓ నాగేందర్‌రెడ్డి, ఏఈఓలు పాల్గొన్నారు.

2రోజుల జాతీయ సదస్సు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న రాణి తదితరులు

సిద్దిపేట ఎడ్యుకేషన్: 'జీవ వైవిధ్యాన్ని పరిరక్షించేందుకు వృక్షశాస్త్ర పురోగతిలో ఇటీవలి పోకడలు' అనే అంశంపై జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు వృక్షశాస్త్ర విభాగాధిపతి, సదస్సు కన్వీనర్ డాక్టర్ రాణి తెలిపారు. బుధవారం ఆమె ప్రిన్సిపాల్ డా.సీహెచ్ ప్రసాద్, అధ్యాపకులతో కలిసి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 27, 28 తేదీలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరగనున్న ఈ సదస్సుకు వివిధ రాష్ట్రాల నుంచి అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు రానున్నారని తెలిపారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వాసం శ్రీనివాస్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ సీహెచ్ మధుసూదన్, పీజీ కోఆర్డినేటర్ అయోధ్యరెడ్డి పాల్గొన్నారు.

పేలిన ట్రాన్స్‌ఫార్మర్

సబ్ స్టేషన్‌లో భారీ అగ్ని ప్రమాదం

- భీకర శబ్దం.. ఉలిక్కిపడిన జనం
- దట్టమైన పొగ.. ఎగిసిన మంటలు
- 3 గంటల త్వరాత అదుపులోకి వచ్చిన మంటలు
- రూ.20కోట్ల వరకు నష్టం
- సిద్దిపేట, దుబ్బాక సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సిద్దిపేటలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ట్రాన్స్‌ఫార్మర్ పేలడంతో భీకరమైన శబ్దంతో కూడిన మంటలు చెలరేగాయి. మంటలు ఎగిసిపడటంతో అక్కడున్న వారు భయాందోళన చెందారు. అగ్నిమాపక సిబ్బంది మూడు గంటలు శ్రమించాక మంటలు అదుపులోకి వచ్చాయి. దాదాపు 20 కోట్ల ఆస్తి నష్టం జరిగిందని అంచనా. ట్రాన్స్‌ఫార్మర్ పేలడంతో కొన్నిగంటల పాటు సిద్దిపేట, దుబ్బాక సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని 220కేవీ సబ్ స్టేషన్‌లో 100 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. బుధవారం సాయంత్రం 6.35ని.లకు స్థానిక డిగ్రీ కళాశాల చౌరస్తాలోని 220కేవీ సబ్ స్టేషన్‌లో 100ఎమ్‌వీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. దీంతో సిద్దిపేట పట్టణంతో పాటుగా దుబ్బాక నియోజకవర్గ పరిధిలోని పలు సబ్ స్టేషన్‌లకు వెళ్లే విద్యుత్ సరఫరా ఆగిపోయింది. విద్యుత్ భవన సమీపంలోనే ఈ సబ్ స్టేషన్ ఉండటంతో విద్యుత్‌శాఖ అధికారులు వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా ఫైర్ ఇంజన్ ఘటన స్థలానికి చేరుకుంది. వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. వెంటనే దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్ ఫైర్ స్టేషన్‌ల నుంచి ఫైర్ ఇంజన్‌లను రప్పించారు. దీంతో పాటుగా



ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఎగిసి పడుతున్న మంటలు



ఘటనా స్థలం వద్ద ప్రజలు

సిద్దిపేట మున్సిపల్ వాటర్ ట్యాంకుల సహాయంతో మంటలు అదుపులోకి తీసుకువచ్చారు. అగ్నిమాపక సిబ్బంది మూడు గంటలు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాద ఘటనతో పట్టణ వాసులు భయందోళనకు గురయ్యారు. దీంతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల చౌరస్తాకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కాగా, పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తాలో 1997లో సిద్దిపేటలో 220కేవీ సబ్ స్టేషన్‌ను నిర్మించారు. ఈసబ్ స్టేషన్‌లో 100 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు ఇతర ట్రాన్స్‌ఫార్మర్‌లను అమర్చారు. సాంకేతిక సమస్యలు తలెత్తడంతో 100 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. దాని విలువ దాదాపు రూ.7కోట్లకుపైగా ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదం ధాటికి సమీపంలోని విద్యుత్ పరికరాలు, ఇతర వస్తువులు కాలి బూడిదయ్యాయి. మొత్తం కలిపి దాదాపు రూ.20 కోట్ల వరకు నష్టం వాటిల్లి ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

అంధకారంలో సిద్దిపేట

సాయంత్రం 6.45కు అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడంతో పట్టణంతో పాటుగా ఏడు సబ్ స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరపరా నిలిచిపోయింది. దీంతో సిద్దిపేట పట్టణం రాత్రి అంధకారంలోనే ఉంది.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు: హరీశ్‌రావు



సూచనలు చేస్తున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, ప్రభాకర్‌రెడ్డి

ఘటన స్థలంలో ఎమ్మెల్యేలు హరీష్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి రెండు గంటల పాటు ఉండి పరిస్థితిని పర్యవేక్షించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, విద్యుత్‌శాఖ అధికారులతో ఫోన్లో మాట్లాడామని విద్యుత్ సరఫరా సక్రమంగా జరిగేలా అధికారులు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఇదిలాఉండగా.. మంటలు అదుపులోకి వచ్చే వరకు అక్కడే ఉండి పరిస్థితిని సమీక్షించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, విద్యుత్‌శాఖ అధికారులతో ఫోన్లో మాట్లాడారు. వెంటనే విద్యుత్ సరాఫరా పునరుద్ధరణ అయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

జీవనం కంప్యూటర్‌తో అనుసంధానం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నేటి మానవ జీవనం కంప్యూటర్‌తో అనుసంధానం అయ్యిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో రూ.50 లక్షలతో నిర్మించిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో వర్షం వస్తే పాఠశాల తరగతి గదుల్లో శ్లాబు నుంచి పెచ్చులు ఊడిపడేవన్నారు. వర్షం కురిస్తే పాఠశాలకు సెలవులు ఇవ్వాల్సిన పరిస్థితి ఉండేదని గుర్తుచేశారు. కాని గత ప్రభుత్వం బాలికల ఉన్నత పాఠశాలను కార్పొరేట్ స్థాయి పాఠశాలగా నిర్మించిందని చెప్పారు. ప్రసుత్తం 30 తరగతి గదులు, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన క్రీడా మైదానం ఉందని పేర్కొన్నారు. జిల్లాలోనే అధిక సంఖ్యలో బాలికలు ఉన్న పాఠశాల ఇదేనని చెప్పారు. గత సంవత్సరం 99 శాతం రిజల్ట్ వచ్చిందని, ఈ సంవత్సరం 100 శాతం ఫలితాలతోపాటు అందరూ 10 జీపీఏలు సాధించాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల రోజులు సెల్‌ఫోన్‌లు, టీవీలకు దూరంగా ఉండాలని సూచించారు. నేడు కంప్యూటర్ అందరికీ ఎంతో ఉపయోగపడుతుందని, డాక్టర్, ఇంజనీర్, ఏవరైనా కంప్యూటర్‌పై ఆధారపడిన పరిస్థితి ఉందన్నారు. అందుకే రూ.50లక్షల నిధులతో 21 కంప్యూటర్‌లతో కూడిన కంప్యూటర్ ల్యాబ్‌ను నిర్మించామని తెలిపారు. విద్యార్థులు ఈ ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లాలో పోటీలలో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

తపాస్‌పల్లి నుంచి చెరువులకు నీరు

- విడుదల చేసిన అధికారులు
- కాలువను పనులు చేపట్టిన జెడ్పీటీసీ
- సాక్షికి కృతజ్ఞతలు తెలిపిన రైతులు

సాక్షి ఎఫెక్ట్



కాలువను శుభ్రం చేయిస్తున్న ప్రశాంత్

కొండపాక(గజ్వేల్): మండలంలో యాసంగి వరి పంటకు నీటి ఎద్దడి తలెత్తకుండా చూసేందుకు అధికారులు, నాయకులు స్పందించారు. 19న సాక్షి దినపత్రికలో వచ్చిన 'ఎండుతున్న చెరువులు' అనే ప్రత్యేక కథనానికి అధికారులు స్పందించారు. తపాస్‌పల్లి రిజర్వాయర్ డీఈఈ అంజయ్య అదే రోజు సాయంత్రం 5గంటలకు తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి డీ 4 కెనల్ ద్వారా మండలంలోని చెరువుల్లోకి నీటిని విడుదల చేశారు. అలాగే ఏడాది కాలంగా శుభ్రం చేయకపోవడంతో కాలువ చెత్తా చెదారం, పిచ్చి మొక్కలతో నిండిపోయింది. ఈ విషయాన్ని రైతులు జెడ్పీటీసీ అనంతుల అశ్విని దృష్టికి తీసుకెళ్ళారు. దీంతో ఆమె భర్త ప్రశాంత్ 20 మంది రైతులతో కలిసి జేసీబీ సాయంతో 12కిలో మీటర్ల మేర కాలువను శుభ్రం చేయించారు. గురువారం చెరువులకు పూర్తిస్థాయిలో నీరు చేరుతుందని ఆయన తెలిపారు. సాక్షి దినపత్రిక యాజమాన్యం, సిబ్బందికి కొండపాక, దమ్మక్కపల్లి, తిమ్మారెడ్డిపల్లి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

మరోసారి తెరపైకి 'అవిశ్వాసం'

- గతేడాది ఇచ్చిన తీర్మానం అమలుకు వినతి
- అదనపు కలెక్టర్‌ను కోరిన అసంతృప్త కౌన్సిలర్లు



గరీమా అగర్వాల్‌కు వినతి పత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానం వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. గతేడాది ఫిబ్రవరి 9న తాము ఇచ్చిన తీర్మానాన్ని అమలు చేయాలని కోరుతూ బుధవారం సాయంత్రం జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్‌కు అసంతృప్త కౌన్సిలర్లు మళ్లీ వినతి పత్రం అందజేశారు. దీంతో మున్సిపాలిటీ రాజకీయం ఆసక్తికరంగా మారింది. అవినీతి, అక్రమాలకు పాల్పడటమే కాకుండా పాలనలో ఒంటెద్దు పోకడలను ప్రదర్శిస్తున్నాడని ఆరోపిస్తూ 20 మంది కౌన్సిలర్లలో 14 మంది మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళిపై గుర్రుగా ఉన్న సంగతి తెల్సిందే. దీంతో వారు స్వయంగా సంతకాలు చేసిన అవిశ్వాస తీర్మానాన్ని గతేడాది కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్‌కు అందజేసిన విషయం కూడా విదితమే. వివిధ కారణాల వల్ల ఆ అవిశ్వాసం ఆగిపోయింది. ఈ క్రమంలో బుధవారం అసంతృప్త కౌన్సిలర్లు మాట్లాడుతూ.. గత నెలలో జరిగిన సమావేశంలో పనులు చేయకుండానే నిధులు డ్రా చేసిన అంశంపై నిలదీస్తే... తగు చర్యలు తీసుకుంటానని చెప్పిన చైర్మన్ తన వైఖరిని మార్చుకోలేదని ఆరోపించారు. ఆయన వైఖరితో విసిగిపోయి మరోసారి అవిశ్వాసానికి సిద్ధమైనట్లు చెప్పారు.

పోషకాహారలోపం తలెత్తకుండా చూడాలి

చిన్నారుల్లో పోషకాహారలోపం తలెత్తకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ సూచించారు. బుధవారం గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 11వ నెంబర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలతో కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అవుతున్న బాలామృతం, బాలామృతం ప్లస్‌ను సరైన విధంగా వినియోగించాలని సూచించారు. పిల్లలు బరువు ఉండేలా చూసుకోవాలని, గర్భిణులు, బాలింతలు హిమోగ్లోబిన్ తగ్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోషక విలువలున్న ఆహారంతో పాటు నిరంతరం వైద్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రానికి సరఫరా అయిన గుడ్ల నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ వెంకటరాజమ్మ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కాల్వలపై చిన్నచూపేలా?

- మల్లన్న సాగర్‌లో 3ఏళ్లుగా ముందుకు సాగని పనులు
- సాగునీరందక ఎండుతున్న పంటలు
- ఆందోళనలో అన్నదాతలు

తలాపునే సముద్రం ఉన్నా తాగేందుకు నీరులేని చందంగా తయారైంది జిల్లాలోని చాలా పొలాల పరిస్థితి. తొగుట మండలంలో కాళేశ్వరం పథకంలో భాగంగా 50టీఎంసీల సామర్థ్యంతో మల్లన్న సాగర్ రిజర్వాయర్ నిర్మించారు. 3ఏళ్లు గడుస్తున్నా చిన్న కాలువల నిర్మాణాలు మాత్రం ముందుకు సాగడంలేదు. దీంతో పొలాలకు నీరందని పరిస్థితి నెలకొంది.



నిలిచిన మల్లన్నసాగర్ కాలువ నిర్మాణం

దుబ్బాకటౌన్: మల్లన్నసాగర్ ప్యాకేజీ కింద ప్రధాన కాలువల నిర్మాణం పూర్తిచేశారు. రెండేళ్ల నుంచి ఎండాకాలంలో సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గాలతో పాటుగా రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని సుమారుగా 57 ప్రధాన చెరువులను నింపుతున్నారు. 20 రోజులుగా మల్లన్నసాగర్ ప్రధాన కాలువ ద్వారా నీరు వదలడంతో సిద్దిపేట, నంగునూర్, చిన్నకోడూర్, దుబ్బాక మండలంలోని కొన్ని గ్రామాలు, నారాయణరావుపేట, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మద్దికుంట, మొర్రాయిపల్లి, చిన్న చీకోడ్, ముస్తాబాద్‌లోని చెరువులు నింపుతున్నారు. కూడవెల్లి, హల్దీ వాగుల్లోకి సైతం నీళ్లొదలడంతో చెక్ డ్యాంలు నిండి జలకళ సంతరించుకొంది. కూడవెల్లి వాగులోకి 20 రోజుల క్రితమే నీరు వదలడంతో వాగుపై ఉన్న 56చెక్ డ్యాంలు నిండి రాజన్నసిరిసిల్ల జిల్లా నర్మాల వద్ద ఎగువ మానేరులోకి నీరు చేరుతోంది.

ముందుకు సాగని కాలువల నిర్మాణం

మల్లన్న సాగర్ ప్రాజెక్టు పూర్తయి 3ఏళ్లు గడుస్తున్నా ఇంకా చాలా కాలువల నిర్మాణాలు పూర్తి కాలేదు. ప్రధాన కాలువలు పూర్తయినా చాలా గ్రామాల్లో చెరువులు, కుంటలు నింపే చిన్న కాలువల నిర్మాణాలు ఇప్పటికీ నత్తనడకన సాగుతున్నాయి. దుబ్బాకలోని ముస్తాబాద్ రోడ్డులో సుమారుగా 200 మీటర్లకు పైగా కాలువ నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో పెద్ద చెరువు, మల్లాయపల్లి, చెల్లాపూర్, చీకోడ్, కమ్మరపల్లి, అచ్చుమాయపల్లి, జోడిచెర్ల, ఆరపల్లి, పోతారం, గంభీర్‌పూర్, శిలాజీనగర్ గ్రామాల్లోని చెరువులు, కుంటలకు నీరందని దుస్థితి ఏర్పడింది. కాలువ పూర్తవుతుందనే ఆశతో పంటలు వేసుకున్న రైతులకు నిరాశే ఎదురైంది. పంటలు ఎండిపోతున్నాయని ఆయా గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. తొందరగా కాలువ నిర్మాణం పూర్తిచేసి తమను ఆదుకోవాలని కోరుతున్నారు. పెద్ద గుండవెల్లి, దుంపలపల్లి చెరువులకు కూడా నీరు రావడం లేదని వాపోయారు.

అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యేలు

మల్లన్నసాగర్‌కు అనుసంధానంగా నీరందించే కాలువలు చాలా చోట్ల పెండింగ్‌లో ఉన్నాయని ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో పాటు మాజీ మంత్రి హరీశ్‌రావు సైతం గళమెత్తారు. త్వరగా కాలువల నిర్మాణం పూర్తిచేసి రైతుల పంటలను కాపాడాలని కోరారు.

పక్కనే ఉన్న పొలాలకు అందని నీరు

మల్లన్నసాగర్ ప్రాజెక్టుకు కేవలం 10–15 కిలోమీటర్ల దూరంలోనే ఉన్నా మిరుదొడ్డి మండలంతో పాటుగా అక్బర్‌పేట-భూంపల్లి, దౌల్తాబాద్, రాయపోల్ మండలాల్లోని చాల గ్రామాలకు కాలువల నీరు అందడంలేదు. మల్లన్నసాగర్ రిజర్వాయర్‌కు కేవలం ఏడెనిమిది కిలోమీటర్ల దూరంలోనే ఉన్న తొగుట మండలంలోని గుడికందుల, గోవర్ధనగిరి, వర్దరాజుపల్లి గ్రామాల్లో కాలువల నుంచి నీరురాక వేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది.

సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తా..



పెండింగ్‌లో ఉన్న కాలువలను త్వరగా పూర్తి చేసి చెరువులు, కుంటలకు నీరందించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరాను. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాను. త్వరగా కాలువలు పూర్తయ్యేలా కృషిచేస్తా. రైతుల పంటలు కాపాడేందుకు ఎన్ని ఇబ్బందులైనా ఎదుర్కొని ముందుకు సాగుతా.

– కొత్త ప్రభాకర్‌రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే

పంటలు ఎండిపోతున్నయ్..



వేసిన పంటలు నీళ్లు లేక ఎండిపోతున్నయ్. 3ఎకరాలు వరినాటు వేస్తే ఇప్పటికే సగం ఎండిపోయింది. కాలువల్లో నీరొస్తుందనుకుంటే ఆ కాలువ పని పూర్తి చేస్తలేరు. దీంతో చాలా పంటలు ఎండిపోతాయి. తమ పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదు. అధికారులు వెంటనే కాలువ నిర్మాణం పూర్తిచేసి మా పంటలు కాపాడాలి.

– రాంచంద్రారెడ్డి, రైతు

కరుణించాలమ్మా.. సమ్మక్కా సారలమ్మా..

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లిలోని పాత కమాన్ వద్ద కొలువైన సమక్క సారలమ్మ జాతర ఆలయ నిర్వాహకులు ఘనంగా ప్రారంభించారు. బుధవారం శాశ్వత పూజారి చింతల రాములమ్మ, చైర్మన్ చింతల రాజేశ్, ప్రధాన పూజారి చింతల రేణుక ఆధ్వర్యంలో జాతర ఉత్సాహంగా మొదలైంది. ఈ సందర్భంగా భక్తులు సమ్మక్క-సారలమ్మకు మొక్కులు చెల్లించుకోవడానికి గద్దెల వద్దకు చేరుకుని ఆ ప్రదేశాలలో గుడారాలను ఏర్పాటు చేసుకున్నారు. చిలుకలగుట్ట వద్ద పూజారులు ప్రత్యేక పూజలు చేసి కుంకుమ బరిణతో సారలమ్మ, పగిడిగిద్ద రాజుల గద్దెల వద్దకు చేర్చారు. సమీప ప్రాంతాల భక్తులు అమ్మవార్లను దర్శించుకుని బెల్లం (బంగారం) కోళ్లు, మేకలను సమర్పించారు. అనంతరం అమ్మవారికి సమర్పించిన బెల్లాన్ని భక్తులకు పంచి మొక్కులు చెల్లించుకున్నారు. చైర్మన్ రాజేశ్ మాట్లాడుతూ 25 ఏళ్లుగా సమ్మక్క-సారలమ్మ జాతర నిర్వహిస్తున్నామని, బుధవారం సారలమ్మ, పగిడిగిద్ద రాజు గద్దెలపైకి వచ్చారని, గురువారం సమ్మక్క గద్దెపైకి వస్తుందని చెప్పారు. అలాగే శుక్ర, శనివారం రెండు రోజులు అమ్మవార్లు భక్తులకు దర్శనం ఇస్తారని, శనివారం రాత్రి అమ్మవార్లు తిరిగి వన ప్రవేశం చేస్తారని తెలిపారు.



అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయికి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మర్కూక్(గజ్వేల్): రాష్ట్రస్థాయి సైన్స్ టాలెంట్ పోటీలకు మండలంలోని పాములపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి నాగచైతన్య రెడ్డి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు లతీసైదా తెలిపారు. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ద్వితీయస్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య



మృతదేహాన్ని బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జహీరాబాద్ టౌన్: బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రమైన మొగుడంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. చిరాగ్‌పల్లి ఎస్ఐ నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మొగుడంపల్లికి చెందిన పోచప్ప కుమారుడైన రాజు(28)కు భార్యతోపాటు నలుగురు పిల్లలు ఉన్నారు. రాజు తాగుడుకు అలవాటు పడి తరుచూ భార్యతో గొడవపడే వాడు. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి మనస్తాపానికి గురై బుధవారం అతిగా మద్యం సేవించి గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. జహీరాబాద్ అగ్నిమాపక అధికారి ప్రశాంత్, సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నీళ్ల కోసం వెళ్లి బావిలో పడి..

టేక్మాల్(మెదక్): ప్రమాదవశాత్తు మహిళ బావిలో పడిన ఘటన టేక్మాల్ మండలంలోని ఎల్లంపల్లిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ తుక్కయ్య వివరాల ప్రకారం.. ఎల్లంపల్లి గ్రామానికి చెందిన కొండి అనిత (35) వ్యవసాయ పనులతోపాటు మేకలు కాస్తూ జీవనం సాగిస్తుంది. బుధవారం సాయంత్రం నీళ్లకోసం వాటర్ బాటిల్ తీసుకొని టేక్మాల్ శివారులోని పాత్రోపులోని బాయి వద్ద వెళ్లింది. ఎంతకు తిరిగి రాకపోవడంతో ఆమెతోపాటు మేకలు కాస్తున్న మరో వ్యక్తి బావి వద్దకు వెళ్లి చూడగా గడ్డపై గొడ్డలి, బావిలో చెప్పులు, వాటర్ బాటిల్ చూసి బావిలో పడిందని ఇరుగు పొరుగువారిని పిలిచాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి గాలింపు చర్యలు చేపట్టారు. ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు.

పిల్లల్ని ఎత్తుకెళ్తున్నాడని..

స్తంభానికి కట్టేసి దేహశుద్ధి

సంగారెడ్డి అర్బన్: పిల్లలను ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించాడని ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటన సంగారెడ్డిలో బుధవారం చోటు చేసుకుంది. బైపాస్ రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని చూసి పిల్లల్ని కిడ్నాప్ చేసేందుకు వచ్చాడని భావించిన స్థానికులు స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి వచ్చి వ్యక్తిని స్టేషన్ కు తీసుకెళ్లారు.

ఔరా.. వాడు వీడేనా..!

ఒకే ఊరిలో పది మందికిపైగా కవలలు

- పోలికలతో ముచ్చటగొల్పుతున్న ట్విన్స్
- రూపురేఖలు ఒకేలా.. చూస్తే తికమక
- తాతముత్తాతల కాలం నుంచే జననం
- పెళ్లయినా వీడని బంధాలు
- శేరిపల్లి గ్రామంలో చిత్ర విచిత్రంగా

ఇంట్లో కవల పిల్లలుంటే ఆ కళే వేరు. అలాంటిది పదిళ్లల్లో కవలలున్నారంటే.. వినడానికి అతిశయోక్తి అనిపించినా.. ఈ అపురూప దృశ్యం చూసిన వారు మాత్రం ముక్కున వేలేసుకుంటారు. ఒకే పోలిక, ఒకే రకమైన దుస్తులు, నడక, మాట తీరు, హావాభావాలు చూస్తుంటే ముచ్చటగొలుపుతుంది. ఠక్కున వీరిని చూస్తే గుర్తుపట్టడం కష్టతరమవుతుంది. ఔరా.. వాడు వీడేనా..! అని విస్మయగొలుపుతుంది. విచిత్రమేమిటంటే.. ఒక ఇంట్లో అయితే.. తాతముత్తాల కాలం నుంచి కవలలు పుట్టడం గమనార్హం. నార్సింగి మండలం శేరిపల్లి గ్రామంలో ఉన్న పరిస్థితిపై నేడు అంతర్జాతీయ కవలల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

– చిన్నశంకరంపేట (మెదక్)



నేడు అంతర్జాతీయ కవలల దినోత్సవం



లక్ష్మయ్య మనుమళ్లు రామ్, లక్ష్మణ్



సాయి సహస్ర, సాయి సంపత్

ఎవరు పుట్టినా రామ-లక్ష్మణులే

ఆ ఇంట తాత ముత్తాతల కాలం నుంచి కవలలకు జన్మనివ్వడం జరుగుతుంది. శేరిపల్లి గ్రామంలోని గజ్వేల్లి రామయ్య, లక్షయ్యలు కవలలుగా జన్మించారు. ఇందులో లక్ష్మయ్య దంపతులకు కవలలు పుట్టగా వీరి పేర్లు కూడా రాములు, లక్ష్మయ్యలనే పెట్టారు. ఒకే రూపు ఒకే మాటతీరుతో గ్రామంలో వీరు ప్రత్యేకంగా నిలిచారు. వీరిని గుర్తుపట్టడం కష్టంగా మారడంతో ఒకరు తలపాగ చుట్టుకోగా, మరొకరు చేతికి వెండ ఆభరణం పెట్టుకొని కనిపిస్తుంటారు. ఇందులో మళ్లీ గజవెల్లి లక్ష్మయ్య కుమారుడు రామచంద్రం–సులోచన దంపతులకు కవలలు పుట్టగా.. వీరి పేరు కూడా రామ్, లక్ష్మణ్ పెట్టుకొని మురిసిపోయారు. అలాగే, రాములు కుమారుడు నాగరాజు–లత దంపతులకు కూడా కవలలు పుట్టారు. ఇందులో ఒకరు బాబు, మరొకరు పాప పుట్టారు. తాత ముత్తాల కాలం నుంచి వీరి ఇంట కవలలు జన్మిస్తున్నారు.

పెళ్లయినా.. ఒకే దగ్గర పుట్టిన రోజు

శేరిపల్లి గ్రామంలో శివ్వోల చంద్రం–వెంకటలక్ష్మి జంటకు సైతం కవలలు జన్మించారు. వీరు పేర్లు సాయి రామ్, సౌమ్య ఇద్దరు ఒకే రకం పోలికలతో ఉండడంతోపాటు ఒకే అభిరుచులతో పెరిగారు. మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివిన వీరు మంచి అభిరుచులతో ముందుకు సాగుతున్నారు. సౌమ్య వివాహం కాగా, రామ్ బీఎడ్ పూర్తి చేశారు. ప్రస్తుతం షార్ట్ ఫిల్మ్ యాక్టర్, డైరెక్టర్‌గా పని చేస్తున్నాడు. సౌమ్య పెళ్లి అయ్యి అత్తగారి ఇంటి వద్ద ఉంటున్నప్పటికీ ఒకే రకం దుస్తులు ధరించి, పుట్టిన రోజు ఒకే దగ్గర జరుపుకుంటున్నారు.



పుట్టిన రోజు జరుపుకుంటున్న సౌమ్య, రామ్

ఇద్దరూ ఒకే రోజు పెళ్లి..

పుట్టిన రోజు వేడుకలే కాదు పెళ్లి కూడా ఒకే రోజు నిర్వహిస్తే ఆ సన్నివేశం కనులవిందుగా ఉంటుంది. శేరిపల్లి గ్రామానికి చెందిన శ్రీరామ్ ముత్యాలు, లక్ష్మి దంపతులకు మూడో సంతానంగా కవలలు జన్మించారు. వీరు పేర్లు రామ్ లక్ష్మణ్‌లు వీరు ఒకే పోలికలతో ఉండడంతో పాటు ఒకే అభిరుచితో ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలోనే ఇద్దరు ఒకే రోజు పెళ్లి చేసుకొని ఆనందం పంచుకున్నారు. 2016 మార్చి 16న రామ్ లావణ్యను, లక్ష్మణ్ జ్యోతిని వివాహం చేసుకొని పెద్ద పండుగా చేసుకున్నారు. పెళ్లికి వచ్చిన వారందరూ ఆశ్చర్యంతో పాటు పెళ్లి కూతుళ్లను ఆటపట్టించిన వారే.



రామ్, లక్ష్మణ్‌ల పెళ్లి వేడుక

మరికొందరు కవలలు

- గ్రామానికి చెందిన తాళ్ల నర్సాగౌడ్, లక్ష్మి దంపతులకు ఇద్దరు ఆడబిడ్డలు కవలలు పుట్టగా వారికి మంగ, పద్మ పేర్లు పెట్టారు. వీరు ఇద్దరు కూడా పెళ్లి చేసుకొని గృహిణులుగా జీవిస్తున్నారు.
- సందిగారి చంద్రాగౌడ్, భవానీలకు ఇద్దరు కవలలు జన్మించగా వారి పేర్లు భవ్యశ్రీ, భవిష్యలు జన్మించారు. రాచపల్లి దుర్గయ్య, బాలమణిలకు కవలలుగా ఒక బిడ్డ, కుమారుడు జన్మించారు. వారి పేర్లు రామ్, లక్ష్మి గా నామకరణం చేశారు.
- కామారంలో పూలపల్లి యాదగిరి, మంజుల దంపతులకు ఇద్దరు కుమారులు కవలలుగా పుట్టారు. వీరు పేర్లు రామ్, లక్ష్మణ్‌లే..



రామ్, లక్ష్మణ్

వీరిద్దరికీ ఒకే రకం డ్రస్‌లు వేసి తమ ముచ్చట తీర్చుకుంటున్నారు. పాఠశాల కల్చరల్ ప్రోగ్రామ్స్‌లోనూ వీరు రామ్, లక్ష్మణ్ పాత్రలను ఎంచుకొని తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ప్రస్తుతం ఇద్దరు కూడా ఇంటర్ ప్రతిభను చాటి ఐఐటీకి లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంటున్నారు.

స్నేహితులే నిందితులు

మిత్రుడిని మోసగించి రూ.5 లక్షలు చోరీ

రామాయంపేట(మెదక్): తమను నమ్మిన మిత్రుడిని మోసగించి డబ్బులు ఎత్తుకెళ్లిన ఇద్దరు స్నేహితులని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక సీఐ వెంకటేశ్ మంగళవారం రాత్రి విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. రామాయంపేట పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో ఉంటున్న గందం చంద్రయ్య భార్యకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో వైద్యం కోసం స్వగ్రామమైన చేగుంట మండలం బోనాల కొండాపూర్‌లో కొంత భూమిని అమ్మాడు. స్థలం కొనుగోలు చేసిన అదే గ్రామానికి చెందిన అంజిరెడ్డి మంగళవారం డబ్బులివ్వడానికి రామాయంపేట వచ్చాడు. చంద్రయ్య తన స్నేహితులైన కామారెడ్డి జిల్లా బిక్కనూర్ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన మన్నె శ్రీనివాస్, ఇరుపాక రవీందర్ రెడ్డిని పిలిపించుకున్నాడు. వారిద్దరి సమక్షంలో రూ.5 లక్షలు తీసుకున్న చంద్రయ్య డబ్బులు బీరువాలో దాచాడు. ఎలాగైనా ఆ డబ్బులు కాజేయాలని చంద్రయ్య స్నేహితులు పథకం వేశారు. భార్య ఇంట్లో లేని సమయంలో పథకం ప్రకారం మన్నె శ్రీనివాస్ వచ్చి చంద్రయ్యను బైక్‌పై ఎక్కించుకొని వెళ్లాడు. వారిద్దరూ వెళ్లిపోగానే రవీందర్‌రెడ్డి చంద్రయ్య ఇంటికొచ్చి తాళాలు పగులగొట్టి బీరువాలో దాచి ఉంచిన నగదును ఎత్తుకెళ్లాడు. చంద్రయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానంతో శ్రీనివాస్, రవీందర్ రెడ్డిని కస్టడీలో తీసుకొని తమదైన శైలిలో విచారించగా నేరం ఒప్పుకున్నారు. ఇద్దరి నుంచి రూ.5 లక్షల నగదుతోపాటు రెండు బైక్‌లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటేశ్

కొడుకు మరణం తట్టుకోలేక..

మనోవేదనతో తండ్రి మృతి

నంగునూరు(సిద్దిపేట): ఇటీవల హత్యకు గురైన కుమారుడిని తలచుకుంటూ తండ్రి మృతి చెందిన ఘటన బుధవారం నంగునూరు మండలం ఘనపూర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బండి వెంకటయ్య కొద్ది రోజుల కిందట హత్యకు గురయ్యాడు. దీంతో తండ్రి బండి బాలమల్లు (90) కుమారుడిని తలుచుకుంటూ నిత్యం రోదిస్తూ మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే హరీశ్‌రావు వెంకటయ్య కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వస్తున్నాడని తెలిసి తన కుమారుడిని అన్యాయంగా పొట్టన పెట్టుకున్నారంటూ రోదిస్తూ కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. కొద్ది సేపటికే అక్కడికి చేరుకున్న హరీశ్‌రావు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యాడు. వెంకటయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చాడు. అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. రోజుల వ్యవధిలోనే ఒకే ఇంట్లో ఇద్దరు మృతి చెందడంతో ఆ ఇంట విషాదం నెలకొంది.



బాలమల్లు (ఫైల్)

కన్నవారి ఎదుటే కానరాని లోకాలకు..

తల్లిదండ్రులు చూస్తుండగా లారీ ఢీకొని బాలుడు మృతి

కొండపాక(గజ్వేల్): లారీ ఢీకొట్టడంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన కుకునూరుపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపాక మండలంలోని అంకిరెడ్డిపల్లికి చెందిన తలపాక కిషన్, లావణ్య దంపతులకు రిత్విక్ (6), దాసు ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరంతా బుధవారం లావణ్య తల్లిగారి ఊరైన కుకునూరుపల్లి మండలం మాత్‌పల్లి గ్రామానికి బోనాల జాతరకు బస్సులో వెళ్తున్నారు. ఈ క్రమంలో కుకునూరుపల్లి బస్టాండ్‌లో బస్సు దిగి మాత్‌పల్లి గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతున్నారు. ఇదే సమయంలో హైదరాబాద్ నుంచి సిద్దిపేట వైపున వెళ్తున్న లారీ రుత్విక్‌ను బలంగా ఢీకొట్టింది. తీవ్ర గాయాతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కళ్ల ఎదుటే కుమారుడు మృతి చెందడంతో తల్లిండ్రుల రోదనలు అక్కడి వారిని కంటతడి పెట్టించాయి. విషయం తెలుసుకున్న కుకునూరుపల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి తల్లి లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని కొమురంభీమ్ జిల్లాకు చెందిన లారీ డ్రైవరు కొట్నూరు నగేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు.



రుత్విక్ (ఫైల్)

దూసుకొచ్చిన మృత్యువు

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి
- లిఫ్ట్ అడిగి ప్రాణాలు పోగొట్టుకున్న డిగ్రీ విద్యార్థి అరుణ్
- మరొక విద్యార్థికి తీవ్ర గాయాలు

గజ్వేల్‌రూరల్: పుస్తకాలు కొనుక్కుందామని బయలుదేరిన ఇద్దరు మిత్రులు మార్గమధ్యలో ఓ యువకుడిని లిఫ్ట్ అడిగారు. కొద్దిదూరం వెళ్లగానే వీరు ప్రయాణిస్తున్న వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో వాహనం నడుపుతున్న యువకుడితో పాటు మరొకరు మృతి చెందారు. ఈ సంఘటన బుధవారం గజ్వేల్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దౌల్తాబాద్ మండలం శేరుపల్లి బందారం గ్రామానికి చెందిన శ్రీను, మంజుల దంపతుల చిన్నకొడుకు అరుణ్(20), రామాయంపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన దేవయ్య–మమత దంపతుల రెండో కుమారుడు దిలీప్ గజ్వేల్‌లోని బీసీ హాస్టల్‌లో ఉంటూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. వీరిద్దరు మంచి స్నేహితులు. సెమిస్టర్ పరీక్షలు దగ్గర పడుతుండటంతో పుస్తకాలను కొనుగోలు చేసేందుకు బుధవారం ఉదయం హాస్టల్ నుంచి బయలుదేరారు. ఈ క్రమంలో గజ్వేల్‌కు చెందిన అయాన్(19) సంగాపూర్ నుంచి గజ్వేల్ వైపు స్కూటీపై వెళ్తున్నాడు. ఇదే సమయంలో అరుణ్, దిలీప్‌లు లిఫ్ట్ అడగడంతో అయాన్ వారిని స్కూటీపై ఎక్కించుకొని బయలుదేరాడు. మార్గమధ్యలో వీరు ప్రయాణిస్తున్న వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో ప్రమాదస్థలిలోనే అరుణ్ మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన అయాన్‌ను కుటుంబ సభ్యులు హైదరాబాద్ తీసుకెళుతుండగా మార్గమధ్యలో ప్రాణాలొదిలాడు. దిలీప్‌ను నిమ్స్‌కు తరలించారు. గజ్వేల్ ఏసీపీ బాలాజీ ఘటనాస్థలాన్ని పరిశీలించారు.



చికిత్స పొందుతున్న డిగ్రీ విద్యార్థి దిలీప్



అరుణ్ (ఫైల్)



అయాన్ (ఫైల్)

లిఫ్ట్ ఇవ్వడమే శాపమైందా..?: కుటుంబీకులు

అయాన్ మదర్సాలో విద్యనభ్యసించి నాలుగు నెలల క్రితమే పట్టణంలోని ఓ బట్టల దుకాణంలో చేరాడు. లిఫ్ట్ ఇవ్వడమే శాపమైందా అంటూ అయాన్ తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు.



పోలీసై వస్తాడనుకున్నా..

అరుణ్ తల్లి మంజుల

ఇయ్యాల పొద్దునే తండ్రితో ఫోన్‌లో మాట్లాడిండు. మంచిగ సదువుకుంటున్న.. పోలీసు కొలువు సాధించి కష్టాలు తీరుస్తానన్నాడు. ఇప్పుడు మాకు దూరమయ్యావా బిడ్డా అంటూ అరుణ్ తల్లి మంజుల రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. అరుణ్ మరణ వార్తతో స్నేహితులు, కుటుంబ సభ్యులంతా దుఃఖసాగరంలో మునిగిపోయారు.

చురుకైన విద్యార్థి

అరుణ్ చదువులో చురుకైన విద్యార్థి. ఇటీవలే ఎన్‌సీసీకి సంబంధించిన ఎగ్జామ్–బీ ఉత్తీర్ణుడయ్యాడు. చదువులో ముందుంటూ ఎన్‌సీసీలో చురుకుగా పాల్గొనే అరుణ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరం.

ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ డాక్టర్ భవానీ

చేతికందిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడటంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు.

రూ.20 వేలు ఇచ్చి భార్యను చంపించాడు

- ఇళ్లు, భూముల విషయంలో అడ్డు వస్తుందని ఘాతుకం
- మహిళ హత్య కేసులో ముగ్గురు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సీఐ కేశవులు

హవేళీఘణాపూర్(మెదక్): ఇళ్ల, భూమి విషయంలో అడ్డు వస్తుందని, రూ.20 వేలు సుపారీ ఇచ్చి అతికిరాతకంగా భార్యను హత్య చేయించాడు. ఈ కేసులో భర్తతోపాటు మరో ఇద్దరిని అరెస్టు చేసి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మండల పరిధిలోని తొగిట గ్రామానికి చెందిన మంద సంగమణిని అతికిరాతకంగా నరికి చంపిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి వివరాలను మెదక్ రూరల్ సీఐ కేశవులు బుధవారం సమావేశంలో వెల్లడించారు. మంద ఆశయ్యకు ఇద్దరు భార్యలు ఉండగా ఇళ్ల, భూముల విషయమై తరుచూ గొడవలు జరుగుతుండేవి. అడ్డుగా ఉన్న మొదటి భార్యను చంపేస్తే ప్రశాంతంగా ఉండవచ్చని పథకం వేశాడు. సంగమణిని చంపితే రూ.20 వేలు ఇస్తానని, ఆమెను చంపి ఇంట్లో బీరువాలో ఉన్న డబ్బులను తీసుకెళ్లమని అదే గ్రామానికి చెందిన మహేశ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాడు. పథకం ప్రకారం ఈ నెల 11న భర్త ఆశయ్య, రెండవ భార్య మంజుల వారి బంధువుల వద్దకు వెళ్లారు. అదే రోజు రాత్రి 10.30 గంటల సమయంలో మహేశ్, తన స్నేహితుడు శివకుమార్‌తో కలిసి ఇంట్లోని ఈలపీటతో సంగమణి గొంతుపై, మొఖంపై కోసి చంపారు. అనంతరం బీరువాలో ఉన్న రూ.20 వేల నగదుతోపాటు ఒంటిపై ఉన్న పుస్తె, చెవి కమ్మలను కోసుకొని వెళ్లిపోయారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తుండగా మహేశ్, శివకుమార్‌ను అనుమానితులుగా గుర్తించి పట్టుకొని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. వీరి ఇద్దరితోపాటు ఆశయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో హవేళీఘణాపూర్ ఎస్ఐ ఆనంద్‌గౌడ్, సిబ్బంది ఏఎస్ఐ సమి, మల్లేశం పాల్గొన్నారు.



నిందితులను చూపుతున్న సీఐ కేశవులు

రూ.2 వేలు ఇవ్వడం లేదని హత్యాయత్నం

నిందితుడు అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు

పటాన్‌చెరు టౌన్: హత్యాయత్నం కేసులో వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి కథనం ప్రకారం.. బీహార్‌కు చెందిన సురాన్ కేవత్, అజయ్ కుమార్, మరో వ్యక్తి ముగ్గురు బతుకుదెరువు కోసం వచ్చారు. పటాన్‌చెరు మండలం ఘనపూర్ శివారు వేములకుంటలోని రాధా హిల్స్ వద్ద పనిచేసుకుంటూ ముగ్గురు ఒకేచోట ఉంటున్నారు. అయితే, సురాన్ కేవత్ నుంచి అజయ్ కుమార్ రూ.2 వేలు అప్పుగా తీసుకున్నాడు. సురాన్ కేవత్ డబ్బులు అడిగితే తిరిగి ఇవ్వక పోగా అజయ్ కుమార్ దుర్భాషలాడాడు. ఈ కోపంతో ఎలాగైనా అతడిని చంపాలని పథకం ప్రకారం సురాన్ కేవత్ సోమవారం మద్యం తీసుకొచ్చి అజయ్ కుమార్‌కు తాగించాడు. అనంతరం ఇనుప రాడ్‌తో దాడి చేసి పారిపోయాడు. రాధా హిల్స్ సూపర్ వైజర్ అక్తర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం రామచంద్రాపురం పరిధిలోని నాగులపల్లి రైల్వే స్టేషన్ వద్ద సురాన్ కేవత్‌ను అదుపులోకి తీసుకొని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

గడ్డి వాములు దగ్ధం

- రెండు పాడి గేదెలు మృతి
- చిలప్‌చెడ్ మండలం ఫైజాబాద్‌లో ఘటన



దగ్ధమైన గడ్డి వాము, గేదెల షెడ్డు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రమాదమో.. దుండగుల పనో తెలియదు గాని ఒకేసారి మూడు గడ్డి వాములు, గేదెల షెడ్డు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో రెండు పాడి గేదెలు మృతి చెందగా మరో రెండు గేదెలకు తీవ్ర తీవ్రగాయాలు అయ్యాయి. ఈ ఘటన బుధవారం చిలప్‌చెడ్ మండలం ఫైజాబాద్‌లో చోటు చేసుకుంది. గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫైజాబాద్ గ్రామానికి చెందిన రైతు టేకుల నర్సింహా రెడ్డి రోజు మాదిరిగా మంగళవారం రాత్రి షెడ్డులో గేదెలను కట్టేసి వెళ్లాడు. అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరగడంతో షెడ్డులోని గడ్డి మోపులు దగ్ధం కాగా అందులో ఉన్న గేదెలకు మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు వచ్చి మంటలార్పారు. అప్పటికే రెండు గేదెలు మృతి చెందగా మరో రెండింటికి గాయాలు అయ్యాయి. రైతుకు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లింది. దీంతోపాటు గ్రామానికి చెందిన మినుపురి పోచయ్యకు చెందిన 200 గడ్డిమోపులు, వంజరి మొగులయ్యకు చెందిన 60 గడ్డిమోపులు దగ్ధం అయ్యాయి. రైతులకు రూ.30 వేల వరకు నష్టం జరిగింది.

సమాజాన్ని మార్చుకుందాం

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు భాస్కర్

దుబ్బాకటౌన్: మానవాళికి ప్రమాదకరంగా మారిన పెట్టుబడి దారి, సామ్రాజ్యవాద దేశాలకు వ్యతిరేకంగా సోషలిస్టు సమాజం నిర్మించడం కోసం లెనిన్ కృషి చేశాడని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గొడ్డుబర్ల భాస్కర్ అన్నారు. బుధవారం దుబ్బాకలోని సీపీఎం కార్యాలయంలో ఫిబ్రవరి 21 రెడ్ బుక్ డే సందర్భంగా లెనిన్ ఓ విప్లవ ఆయుధం పుస్తకాన్ని సామూహిక అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్టుబడి దారి వ్యవస్థను పతనం చేసి దాని స్థానంలో సోషలిజం అనే సాంఘిక సూత్రాన్ని ప్రజలకు అందించారన్నారు. కార్పొరేట్ మతతత్వ బీజేపీని దేశంలో ఓడిస్తే దేశ ప్రజలకు రక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సాధిక్, లక్ష్మీనర్సయ్య, ప్రశాంత్, సాజిద్, రాజు తదితరులు పాల్గొన్నారు.



లెనిన్ పుస్తకాన్ని సామూహికంగా అధ్యయనం చేస్తున్న సీపీఎం నాయకులు

లెనిన్ స్ఫూర్తితో ఉద్యమించాలి

సిద్దిపేటఅర్బన్: ప్రజలను దోపిడీ నుండి విముక్తి చేసి సమసమాజ స్థాపనకు, సమాజ మార్పునకు లెనిన్ స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాళ్లబండి శశిధర్ అన్నారు. లెనిన్ శత జయంతిని పురస్కరించుకొని లెనిన్ రచించిన పుస్తకాలను సామూహిక పఠనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు ప్రణాళికను ప్రజలకు అందించిన ఫిబ్రవరి 21న రెడ్ బుక్ డే జరుపుకుంటామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గోపాలస్వామి, జిల్లా కమిటీ సభ్యులు రవికుమార్, ప్రశాంత్, శిరీష, బాలనర్సయ్య, నాయకులు ప్రభాకర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు జీతాలు చెల్లించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య

సిద్దిపేటరూరల్: జిల్లాలో సుమారు 45పైగా గ్రామ పంచాయతీ కార్మికులకు ఆరు నెలలుగా జీతాలు అందక ఇబ్బంది పడుతున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య అన్నారు. బుధవారం కార్మికులకు జీతాలు చెల్లించాలని కోరుతూ కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ కు వినతి పత్రం అందజేశారు. పెరుగుతున్న ధరలు, నిత్యావసర ఖర్చులతో అర్థాకలితో అలమటిస్తున్నామన్నారు. ప్రతీ నెలా ఇవ్వాల్సిన రెండు జతల డ్రెస్‌లు ఇవ్వడం లేదన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని లేకపోతే కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు నర్సింలు, యాదగిరి, బాబు, కనకవ్వ, యాదయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు